కమలకు:—

మొన్న వాళ్ల శ్యాం విద్యాభ్యాస సందర్భంలో హేమ వచ్చిం దిక్కడకు. అబ్బ! ఆ అమ్మాయి ఎంత అమాయకురాలనుకున్నావ్! తన కొడుకును ఏజిల్లా కలెక్టరుగానో, ఏ సూపరింటెండెంటుగానో చూడాలని అభిలాష. ఎంత చెప్పినా, ఆంగ్లభాష మీదగాని, ఆంగ్ల సాంప్రదాయం మీదగాని, ఆంగ్ల విద్యమీదగాని అభిమానం అంతరించిపోవడం లేదామెలో. ఆవిడ తప్పేముంది? పాపం, అజ్ఞానాంధకారంలో కూలి, కుమిలి, కృశించి, నశించే ఆమె మేధస్సు వజ్రపు తునకల్లా ధగధగా మెరసిపోయే ఈ ప్రభుత్వపు ఉద్యోగాల్ని కాక మరేం కాంచ గలుగుతుంది? దయ, దాక్షిణ్యం, హృదయంలేని జమీందారింట్లో, నిర్జీవంగా, దేశానికి నిరుపయోగంగా, పెట్టెల్లో, దాస్యంలో కులుకుతూ ఉండే ఈ వజ్రపు తునకలు లెక్ఖకు నాలుగే ఉంటాయని ఆవిడ గ్రహించగలుగుతూ ఉందా? మానవుడు తలదాచుకోవడానికి ఒక ఇంటి రూపంలోనో, ఏకాంతాన భగవంతునికి ప్రేమాంజలి సమర్పించడానికి ఒక దేవాలయ రూపంలోనో, వెలసి వెలుగొందడానికి ఉబలాటపడే చిన్నచిన్న మంటిగెడ్డలు కోటానుకోట్లున్నాయని ఆవిడ గుర్తించలేదు. మన పంట భూములన్నీ ఉపయోగించుకొనే నాథుడులేక వట్టి పట్టాలక్రింద తయారవుతున్నాయి.! ఇది తెలియదామెకు. ఎంత చెప్పినా చేసే తప్పును గుర్తించదు; ఆ ఉద్యోగం, ఆ హోదా, ఆ గౌరవం ఆ ఠీవి అంటుంది.

పైగా, ఈఇంగ్లీషు చదువుకోసరం ఆంగ్ల పాఠశాలకు పంపుతానంటుంది వాళ్ల అబ్బాయిని. ఎంత తెలివైన వాడనుకున్నావ్, ఆ అబ్బాయి! అతని తెలివితేటలన్నీ బూడిదను పోసిన పన్నీరుగా నిరుపయోగం అయిపోతాయేమోనని నాకు విచారం. ఐనా, నీవాలోచించు ఏముంది యీ ఇంగ్లీషు చదువులో? విద్యమానవుడికీ, దేశానికీ ప్రపంచానికీ సహాయకారిగా ఉండాలి. మనస్సుకు, దృష్టిపథానికి, సరియైన శిక్షణ గరపడంలోనే విద్యయొక్క గొప్పతనము బహిర్గతమౌతూ ఉంటుంది. వ్యక్తి తనవ్యక్తిత్వాన్ని సమష్టిలో గోల్పోవడమే భారతీయ విద్యాదర్శము. ఆంగ్లవిద్యకు ఆదర్శం ఏమిటో ఊహించుకోగలవా? వాళ్ల సాంప్రదాయాలకు మన సాంప్రదాయాలకు నడుమ, కంచుగోడల్లాగు, తీవ్రమైన భేదాలున్నాయి. గుర్తించరు మనవాళ్లు. భగవంతునికి నీరాజనాన్ని నివేదించడంలో ఉత్కృష్టమైన భావముందని, కాంతిమయుడైన పరమాత్మకు నీరాజన రూపంగా తన ఆత్మనే కానుకగా సమర్పించుకుంటున్నాడని, మన గృహంలో, మన ఉపనిషన్మధువుల సహాయాన నేర్చుకుంటున్నాం; మనం మన పాఠ

శాలకు వెళ్లేటప్పటికి, ఇవన్నీ అనాగరిక జాతుల బహిర్గత విచేష్టితాలు, నిరర్థకాలు అనే బోధకు గురి అవుతున్నాం. ఎందువల్లో ఇది తెలుసా? మనకూ పాశ్చాత్యులకూ దృష్టిపథాలలో అంతులేని విభేదాలున్నాయి. భౌతిక శాస్త్రాలే ప్రమాణాలుగా అంగీకరించే వారికి మన వేద వేదాంగాల గూఢార్థాలు స్ఫురింపవు. పెరిగే పరిస్థితులకు, నేర్చుకునే విద్యకు సామరస్యము లేకుండా బ్రతికే మనకు మన సంఘం అంటే అభిమానం, గౌరవం ఎలా ఉంటాయి? మన ఆచార వ్యవహారాలు, మన విజ్ఞానాలు, మన మతాలు అంటే ఒక విధమైన అసహ్యమూ, అయిష్టమూ అకారణంగానే మనలో జనిస్తూ ఉన్నాయి. మనమూ ఒక మనుష్యులమేనా దృష్టిపథాలు విధ్వంసం చేసేసుకున్న తర్వాత? ఇదేనా విద్యవల్ల రావలసిన మానసిక శిక్షణ? తెలివి తేటలు గల మర్కటాలుగా తయారవుతున్నారు మన బాలబాలికలు! హేమకు ఈ మాటలు రుచిస్తాయా కళ్లను చెదరగొట్టే ఉద్యోగాల కాంతిలో మునిగి తేలుతూఉంటే?

ఎందుకొచ్చిన ఈ ఆంగ్లభాష మన శిరస్సులమీద? మోయలేక కృంగి పోతున్నాం. రెండుమూడు మాటలను కలిపి నూతన సమాసాలను సృష్టించుకోవాలంటే, మన జాతీయ సాంప్రదాయాలను వెల్లడి పరచుకోవాలంటే మన మాతృభాషల్లో ఉండే అనువూ వీలూ ఈ దురదృష్టపు ఆంగ్ల భాషలో ఉందా? భాషాతర్క శాస్త్రాలకు అనువైన సంబంధం ఉందని గోల పెట్టి లాటిన్ తర్కశాస్త్రాన్ని కెదురుగా ఆంగ్లంలో తర్కశాస్త్రాన్ని తయారుచేసికొన్న ఆంగ్లేయులకు ఇంకొక దేశంలో వాళ్ల ఆంగ్ల భాష మూలాన ఆ దేశీయుల తర్కశాస్త్రాన్ని దూరం చేసెయ్యడానికి మనస్సు ఎలా ఒప్పిందో? దేశీయ తర్కశాస్త్రానికి దూరంగాఉన్న వాళ్లకు జీవితంలో సామరస్యమెలా సిద్ధిస్తుంది? అందువల్ల మన బాలబాలికల సుస్వభావాలు ఎలా వక్రిస్తున్నాయో ఆలోచించుకో గలవా?

పోనీ, హేమ అనుకునేటట్లు, ఈ ఉద్యోగాలైనా ఎంతమంది చదువుకున్నవాళ్లకున్నాయని నీ ఉద్దేశ్యం? నూటికి ఏ ఒక్కడికో ఉంటే అక్కడికొక వింతైన విషయమే. అదీ కాకుండా, వ్యవసాయదారు కుమారుడికి వ్యవసాయమంటేగాని, కలంకారీ వ్యాపారస్థుని వారసుడికి కలంకారీ అంటే గాని ఏమైనా తెలుస్తూ ఉంది అని అనుకుంటున్నావా? ఏమీ లేదు. ఇక చేతిపనుల విషయం చెప్ప నక్కరనేలేదు. పైగా, పొట్ట చుట్టూ గిరగిరా తిరుగుతాయే సర్వ ప్రపంచాలన్నీ, పొట్టలైనా తృప్తిపరచలేని ఈ చదువు ఎందుకు ఇంకా? ఏమిటి వీళ్లంతా వెఱ్ఱిగా ఎగబడడం? అందుకనే గాంధీగారు ఒక చేతిపని ద్వారా విద్యగరపాలని (Wardha Scheme) ప్రయత్నాలు చేస్తున్నారు. గాంధీగారి మార్గం కావలసిన అవసరాలన్నిటినీ తీర్చినా తీర్చకపోయినా, విద్య ఒకచేతిపనిద్వారా, తెలిసిన దాన్నుంచి

తెలియని ఇంకో విషయానికి, వ్యక్తినుండి సమష్టికి, వెళ్లడం చాలా శ్రేయస్కరమైన మార్గంగా ప్రపంచమంతా అంగీకరించారు.

కాని అధః పాతాళాలలో, వైతరణీనది లోతులుచూచే నేటి భారతీయ జాతికి ఈ విద్య చాలా? చేతిపనులేకాదు కావలసింది భారతీయ సాంప్రదాయానుకూలంగా, భారతదేశపు ప్రస్తుతావసరాల ననుసరించి, ముందు జరుగబోయే ప్రపంచనాటకంలో భారతదేశం ఆడబోయే పాత్రానుగుణ్యంగా, మన జాతీయవిద్య తయారవవలసి ఉంది. మన బాల బాలికలకు తమ మాతృభూమిని ప్రేమించడం, ఆ ప్రేమలో ఆనందాన్ని, అనుభవించడం గర్వపడడం ముందు నేర్పవలసిన అవసరముంది. ఇది కళలసహాయాన ప్రవేశపెట్టవలసినమార్పు; అందులోనూ ఎక్కువగా సంగీత నాట్య నృత్య కళలమీద ఆధారపడి ఉంటుంది. తరువాత చిన్న చిన్న కథలవల్ల మన జాతీయ సాంప్రదాయాలంటే, మన జాతీయ వీరులంటే మన బాల బాలికలు ఉద్రేకపూరితులై పోవాలి. ఇలాంటి ఉద్రేకాలకుగాని, హృదయ శిక్షణకుగాని, వార్ధా విద్యలో తగిన స్థానంలేదు. కళా జ్ఞానము ఇప్పు డున్నట్టుగా కాకుండా మన విద్యలో ఒక ముఖ్యమైన భాగంగా జాతీయుడైన ప్రతివాని అందుబాటులో ఉండాలి. ఇప్పుడిటలీలో అనుకరించే పద్ధతి ఇదే! విద్యార్థికి ప్రప్రథమంలో నేర్చుకునే విషయాల యందు గౌరవం, తాను స్వీకరించబోయే విమాతృభావాలయందు ఒకవిధమైన అభిమానం పెంపొందింపచేస్తే ఆతరువాత సాంఘికధర్మాలు, సాంప్రదాయాలు, దేశస్థితి అందచేస్తే మేధస్సు అందుకోగలుగుతుంది. విద్యావిషయంలో మేధస్సును అభివృద్ధిపరచడం ఎంతముఖ్యమో, సహృదయత్వాన్ని రేకెత్తించడంకూడా అంతేఅవసరం. మనము బాలబాలికల్ని పరిపూర్ణ స్వరూపులు, స్వేచ్ఛాజీవులు హృదయపూరితులు మేధస్సమేతులుగానే పరిగణిస్తున్నామంటావా?

ఇంతకూ నే చెప్పేది ఏమిటంటే ఈ చదువులకు పంపి వాళ్ల ప్రకృతిని నాశనం చెయ్యడంకంటే, ఏ వడ్రంగమో నేర్పి జాతీయ స్వరూపుల్నిగా చేయమని. ఏం, మనపిల్లలకు కావలసిన వాతావరణాన్ని మాతలైన మనం తయారు చెయ్యలేం? అలా చెయ్యలేక పోయినట్లయితే ఇంకా మన మాతృత్వం ఎందుకు? ఇతర ప్రభుత్వపు తాకిడికి బాధపడుతూ, దెబ్బలు తింటూ, మన సంతానాన్ని మన జాతిగా, మన దాస్యశృంఖలాలు త్రెంపివేసే వీర మూర్తులుగా, తయారు చేసికోలేం? ఉద్యోగాల పేరుతో, సంఘానికీ, దేశానికీ, మన ఆత్మకూ ద్రోహం చేసేస్తామా?

ఎన్ని చెప్పినా హేమ ఇంగ్లీషు చదువుతుంది!! మళ్లీ ఇంకోమారు చెప్పి చూస్తాను. నీవుకూడా వ్రాయి.

ఎపుడూ నీ విషయమే తలచుకొనే,

'వాణి'.